# సాక్షి
# జనగామ

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025






**మనకెప్పుడు క్రికెట్ 'వైభవం'**
వరంగల్ క్రికెట్ సంఘానికి సొంత మైదానం లేకపోవడంతో ప్రైవేట్ పిచ్‌లను ఆశ్రయించాల్సి వస్తుంది. అసౌకర్యాల నడుమ క్రికెటర్లు శిక్షణ తీసుకుంటున్నారు. - IIలో▸



**'ఇందిరమ్మ' జాబితా క్రాస్ చెక్**
ఇందిరమ్మ ఇళ్ల జాబితాను అధికారులు మళ్లీ క్రాస్ చెక్ చేస్తున్నారు. అర్హులా? కాదా? అని నిర్ధారించడానికి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
$39^0/26^0$

**వాతావరణం**
జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. సాయంత్రం పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'నీట్'కు పకడ్బందీ ఏర్పాట్లు
కలెక్టర్ రిజ్వాన్ బాషా



**జనగామ రూరల్:** మే 4వ తేదీన జరగనున్న జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష 2025 (నీట్)కు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి 582 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని, వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే రహదారి భద్రతపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి
సీనియర్ సివిల్ జడ్జి జస్టిస్ విక్రమ్



**జనగామ రూరల్:** విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జస్టిస్ సి.విక్రమ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బాల సదనాన్ని ఆయన సందర్శించి జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ రూపొందించిన చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీంపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలకు ఎప్పుడు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ స్నేహభావంతో ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పిల్లల వసతులు భోజనం, టిఫిన్స్, స్నాక్స్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణవేణి, బి.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

### అభ్యర్థుల తుది జాబితా విడుదల

**జనగామ:** జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో ఖాళీ ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్, ఉద్యోగ నియామకానికి ఎంపికైన వివరాలను విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లిఖార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా 33 పోస్టుల భర్తీకి గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం విధితమే. అర్హత సాధించిన అభ్యర్థుల జాబితా ను అధికారిక వెబ్‌సైట్‌తో పాటు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ నోటీసు బోర్డుపై అందుబాటులో ఉంచినట్లు స్పష్టం చేశారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే, అందుకు అవసరమైన వివరాలను జోడించి, మే 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందించాలన్నారు. కాగా ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో మే 2వ తేదీన ఉదయం 11.30 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

### అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి

**జనగామ రూరల్:** టీజీపీఎస్సీలో వసతి గృహ సంక్షేమ అధికారిగా ఎంపికైన గ్రేడ్–2 అభ్యర్థులు జోన్ 5లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని నల్లగొండ ఉపసంచాలకులు ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. నేడు (బుధవారం) 10.30గంటలకు నల్ల గొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందని, అభ్యర్థులు హాజరుకావాలన్నారు.

మీరు (పరీక్షల్లోనైనా, ఇతర అంశాల్లో అయినా) విఫలమైతే, ఎప్పటికీ వదులుకోకండి ఎందుకంటే వైఫల్యం అంటే నేర్చుకోవడంలో మొదటి ప్రయత్నం అని అర్థం. వైఫల్యం అనే వ్యాధిని చంపడానికి ఆత్మ విశ్వాసం, కృషి ఉత్తమ ఔషధం. అది మిమ్మల్ని విజయవంతమైన వ్యక్తిగా చేస్తుంది. - ఏపీజే అబ్దుల్ కలాం







# ఓటమి.. విజయానికి నాంది

**ఒక్కసారి ఫెయిలైతే జీవితమే ముగిసినట్టు కాదు**
- దీన్ని అధిగమించి సక్సెస్ ఫుల్ లైఫ్‌తో ముందుకెళ్లొచ్చు
- పిల్లల మార్కులను పేరెంట్స్ ప్రతిష్టగా భావించొద్దు
- ఫలితం ఎలా ఉన్నా ప్రోత్సహిస్తేనే బంగారు భవిష్యత్
- పదో తరగతి ఫలితాల వేళ మానసిక, వైద్య నిపుణుల సూచనలు

ఇటీవల విడుదలైన టెన్త్ ఫెయిల్ సినిమాలో హీరో తన గ్రామంలోని పాఠశాలలో పదో తరగతి ఫెయిలవుతాడు. ఆ తరువాత కష్టపడి చదువుతాడు. ఢిల్లీ వెళ్లి పిండిమర, టీస్టాల్ తదితర పనులు చేసుకుంటూనే సివిల్స్‌కు ప్రిపేరవుతాడు. ఒకటి, కాదు రెండు కాదు.. ఆరోసారి తను అనుకున్న ఐపీఎస్ సాధిస్తాడు. అతను మొదటిసారి రాలేదని కుంగిపోకుండా 'రీస్టార్ట్' అంటూ తన చదువు మొదలుపెట్టి చివరికి అనుకున్నది సాధిస్తాడు.

సాక్షి, వరంగల్:

చదువంటే మార్కులు తెచ్చుకోవడం కాదు...జీవితాన్ని నేర్చుకోవడం, పరీక్షలో ఫెయిలవడం సరిదిద్దుకోలేని తప్పేమీ కాదు...అందరూ ఎప్పుడో ఒకప్పుడూ ఫెయిల్ అవుతారు...కానీ పరీక్షలో మార్కులే ప్రతిభకు, సామర్థ్యానికి కొలమానం కాదు...జీవితంలో ఇంకా చాలా అవకాశాలున్నాయనే విషయాన్ని మర్చిపోతే వచ్చేది దుఃఖం, ఆవేశమే. ఇవి సాధిస్తామన్న ఆశను చంపకూడదు. వారం క్రితం వెల్లడైన ఇంటర్ ఫలితాల్లో తప్పిన కొందరు విద్యార్థులు క్షణికావేశంతో ఆత్మహత్యలు చేసుకున్నా దరిమిలా...పదో తరగతి ఫలితాలు బుధవారం వెల్లడవుతున్న నేపథ్యంలో తమ పిల్లలతో తల్లిదండ్రులు ఓ స్నేహితునిలా...గురువులా మెదిలి వారిలో ఉన్న భయాన్ని పోగొట్టాలి. భవిష్యత్‌పై భరోసా ఇవ్వాల్సిన అవసరముందన్న అభిప్రాయం విద్యావేత్తలు, మానసిక వైద్యనిపుణుల్లో వ్యక్తం అవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలకు 42,262 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష ఫలితాల సమయం లో ర్యాంక్‌లు రాలేదని కొందరు...మార్కులు తక్కువ వచ్చాయని ఇంకొందరు...ఫెయిల్ అయ్యామని మరికొందరు మానసిక ఒత్తిడికి గురై కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థుల కంటే కూడా వారి ఫలితాలపై తల్లిదండ్రులు ఎక్కువ అంచనాలు పెట్టుకోవడం కూడా ఈ తరహా ఘటనలకు అవకాశం ఇస్తోంది. పిల్లల మార్కులను తల్లిదండ్రులు ప్రతిష్టగా భావించొద్దని సూచిస్తున్నారు. ఇతర విద్యార్థులతో పోల్చడం వల్ల పిల్లల మానసిక వ్యథకులోనై కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశముంటుందని అంటున్నారు.

జిల్లాల వారీగా
పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు

| | |
|---|---|
| హనుమకొండ | 12,010 |
| వరంగల్ | 9,237 |
| మహబూబాబాద్ | 8,194 |
| జనగామ | 6,238 |
| జేఎస్ భూపాలపల్లి | 3,449 |
| ములుగు | 3,134 |



**ఇవీ మరవొద్దు...**
- ఫలితాలు ఎలా వచ్చినా విద్యార్థులు పాజిటివ్‌గా తీసుకోవాలి. విద్యార్థులతో పాటు కుటుంబం, స్నేహితులు, అధ్యాపకులు, చుట్టుపక్కల వారు ప్రవర్తించే తీరు ప్రభావం చూపుతుంది.
- ఫెయిలైన విద్యార్థి ఇంతటితోనే అంతా అయిపోయిందనే భావనను వీడాలి. ఓ పరీక్షలో మాత్రమే ఫెయిలయ్యామని, జీవితంలో కాదన్న విషయాన్ని గ్రహించాలి.
- ముఖ్యంగా క్షణికావేశానికి గురికాకూడదు. తొందరపాటుగా ఏ నిర్ణయాలు తీసుకోకూడదు. తమలోని బాధను స్నేహితులు, తల్లిదండ్రులతో పంచుకోవడంతోపాటు నెగిటివ్ ఆలోచనలను దూరం పెట్టాలి.
- ఫెయిలైనా జీవితంలో విజేతలుగా నిలిచిన వారి గురించి తెలియజేయాలి. ఆలోచిస్తూ బాగా చదివేలా వారిని ప్రోత్సహించాలి.
- ఇన్ని చెప్పినా విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తే వెంటనే వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

**రిజల్ట్స్ ఎలా ఉన్నా పాజిటివ్‌గా తీసుకోవాలి**



పరీక్ష ఫలితాలు అంటేనే చాలా మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో కంగారు ఉండడం సహజమే. ఫలితాలు ఎలా ఉంటాయో...ఎన్ని మార్కులు వస్తాయోనని విద్యార్థులు సైతం టెన్షన్ పడుతుంటారు. కానీ, పరీక్ష ఫలితం ఎలా వచ్చినా ఆందోళన చెందకూడదు. అంతా పాజిటివ్‌గా తీసుకోవాలి. అనుకున్న దాని కంటే తక్కువ మార్కులు వచ్చినా, చదివినా చదువుకు తగిన ఫలితాలు రాలేదని అతిగా స్పందించొద్దు. ఒక్క ఓటమితో తమ చదువు ముగిసిపోదు. ప్రపంచంలోని మేధావులంతా ఎక్కువ మార్కులు సాధించినవారేమీ కాదని విషయాన్ని గుర్తించాలి. తల్లిదండ్రులు కూడా ఈ దిశగా విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వాలి. -డాక్టర్ రాజు, మానసిక వైద్య నిపుణుడు.

**జీవితం నష్టపోదనే భరోసానివ్వాలి**



ఒక్కసారి పరీక్షలో తప్పితే జీవితం నష్టపోదనే భరోసానివ్వాలి. మళ్లీ చదివి పాస్ కావొచ్చనే ధైర్యం నింపాలి. పాస్ కాలేదని తిట్టొద్దు. వేధించకుండా సముదాయించాలి. తిరిగి మంచిగా చదివి ఉత్తీర్ణులయ్యేలా ప్రోత్సహించాలి. విద్యార్థులు కూడా క్షణికావేశానికి గురికావొద్దు. స్నేహితులు, తల్లిదండ్రులతోపాటు సన్నిహిత గురువులతో చర్చించాలి. మార్కులు కాదు.. విజ్ఞానమే ముఖ్యమనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. -వరుణ్, వైద్యుడు.

# దొంగలపై నిఘా పెట్టాలి

- నెలవారీ నేర సమీక్షలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్

**వరంగల్ క్రైం:** చోరీ కేసుల్లో శిక్ష అనుభవించి జైలు నుంచి బయటకు వచ్చే దొంగలపై నిఘా పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అధికారులకు సూచించారు. మార్చికి సంబంధించిన నెలవారీ నేర సమీక్షను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్లకు పిలిపించడం కాకుండా, అధికారులు వారిని వ్యక్తిగతంగా కలిసి ప్రస్తుత స్థితిగతులను ఆరా తీయాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, సీసీ కెమెరాల పనితీరు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, కొత్త సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషిచేయాలని సీపీ ఆదేశించారు. మహిళా సిబ్బందిని ప్రోత్సహించడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని చెప్పారు.



మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

జాతీయస్థాయిలో గుర్తింపు, అవార్డులు తీసుకొచ్చే విధంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ ఉండాలని, రేయింబవళ్లు ప్రజల కోసం పనిచేసి పోలీస్ శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చే అధికారులకు అవార్డులు రివార్డులు ఉంటాయన్నారు. సమావేశంలో డీసీపీలు రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనార్దన్, జనగామ ఏఎస్పీ చైతన్య, ఏఎస్పీ మనాన్ భట్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# వేసవి క్రీడల శిక్షణకు వేళాయె

- రేపటి నుంచి 10 పాఠశాలల్లో ప్రారంభం
- అండర్–14 బాల,బాలికలకు అవకాశం

**జనగామ:** రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడల శిక్షణకు ముహూర్తం ఖరారు చేసింది. మే 1వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు అండర్ 14 విభాగంలో బాల,బాలికలకు అథ్లెటిక్స్‌తో పాటు వివిధ క్రీడాంశాలు వాలీబాల్, ఫుట్‌బాల్, మార్షల్ ఆర్ట్స్, బాక్సింగ్, సాఫ్ట్ బాల్‌లో తర్ఫీదును ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 10 క్రీడా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**శిక్షణ కేంద్రాలివే..**
జిల్లాలోని జనగామ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (చౌడారం/అథ్లెటిక్స్), వెంకిర్యాల ఉన్నత పాఠశాల (తైక్వాండో), స్టేషన్‌ఘన్‌పూర్ విద్యా జ్యోతి డిగ్రీ కళాశాల (ఫుట్‌బాల్), స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాక్సింగ్), పాలకుర్తి మండలం చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సాఫ్ట్ బాల్), గూడూరు ఉన్నత పాఠశాల (వాలీబాల్), లింగాలఘణపురం మండలం వనపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (వాలీబాల్), జఫర్‌గఢ్, చిల్పూరు మండలం తమ్మడపల్లి(జి), మల్కాపూర్, నర్మెట మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో (మార్షల్ ఆర్ట్స్)ను నేర్పించనున్నారు. ఉదయం 6.60 నుంచి 8.30 సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రోజుకు రెండు దఫాలుగా బాల, బాలికలకు క్రీడ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే వివిధ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ హాజరయ్యేందుకు ఆసక్తి ఉన్న బాల,బాలికలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్‌ఏటీజీపీ ఎస్ఈ. తెలంగాణ.జీటీవీ.ఇన్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. చివరి రోజు బాల,బాలికలకు సర్టిఫికెట్లను అందిస్తారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



జిల్లాలోని 10 ప్రదేశాల్లో మే 1వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ ప్రారంభమవుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుంది. వేసవిలో క్రీడల ద్వారా శారీరక ధృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడల్లో పాల్గొనాలి.

- బి.వెంకట్‌రెడ్డి,
జిల్లా యువజన, క్రీడల అధికారి

# కష్టపడిన వారికే ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ చామల
- ఓట్లు వేయించే వారే ముఖ్యం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జనగామ:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పార్టీలో నిజాయితీగా పని చేసిన వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. సర్కారు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీకార్యకర్తపై ఉందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పార్టీలోకి ముందు వచ్చామా, వెనక వచ్చామా అన్నది ముఖ్యం కాదని, పదిమందిని కదిలించి ఓట్లు వేయించే వారే అవసరమన్నారు. ఈ సమావేశంలో జనగామ ఇన్‌చార్జ్ బైకానీ లింగం యాదవ్, యాదాద్రి ఇన్‌చార్జ్ లకావత్ ధన్వంతి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మారుజోడు రాంబాబు, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అద్దంకి దయాకర్, పక్కన ఎంపీ చామల, ఎమ్మెల్యే కడియం, కొమ్మూరి

# పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- పీహెచ్‌సీల్లో ఓపీ సేవలను పెంచండి
- ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన వేగవంతం చేయాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



ధాన్యంలో తేమశాతం చూస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ రూరల్:** జిల్లాలోని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం జనగామ మండలంలోని వెంకిర్యాల, గానుగుపహాడ్ పీఏసీఎస్ ధాన్యం సెంటర్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న సరుకును కలెక్టర్ పరిశీలించి అందులో తేమ శాతాన్ని పరిశీలించారు. రోజువారీగా కొనుగోళ్లకు సంబంధించి రిజిస్టర్లను పరిశీలించి వెంటవెంటనే ఓపీఎంఎస్‌లో రైతుల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులను ఇబ్బందికి గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. అక్కడ నుంచి గానుగుపహాడ్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. తిరుగుప్రయాణంలో వడ్లకొండ ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని సఖి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అందులోని రికార్డులతో పాటు స్టాఫ్ రూం, కౌన్సెలింగ్ గదులను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ హుస్సేన్, డీటీ సీఎస్ శ్రీనివాస్, రేణుక, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన వేగవంతం..**
ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి వివిధ ప్రభుత్వ పథకాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేసిన లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రాజీవ్ యువవికాసం దరఖాస్తులు కేటగిరీల వారీగా పరిశీలన చేసి సిబిల్ స్కోర్ నిమిత్తం ఆయా బ్యాంకులకు పంపించాలన్నారు. ఏఏపీ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

# లక్ష్యం చేరని ఎల్ఆర్ఎస్

- ప్లాట్ల క్రమబద్ధీకరణకు ముందుకురాని యజమానులు
- నేటితో ముగియనున్న గడువు
- జీపీ, పురపాలిక పరిధిలో రూ.22.82కోట్లు వసూళ్లు

**జనగామ:** అనధికార లేఅవుట్‌లోని స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన 25శాతం రాయితీ గడువు పెంచినా స్థలాల క్రమబద్ధీకరణ లక్ష్యం చేరలేదు. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) రాయితీ గడువు నేటితో ముగియనుంది. మార్చి 30వ తేదీ వరకు 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించగా, ఈ నెల 2వ నుంచి 30వ తేదీ వరకు రెండోసారి అవకాశం కల్పించారు. ఎల్ఆర్ఎస్ 2025–26 ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ గడువుకు నేడు (బుధవారం) ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉంది.

**ప్రొసీడింగ్ కాపీలు రాకపోవడంతో..**
రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన మేర ఎల్ఆర్ఎస్ లక్ష్యం నెరవేరడం లేదు. రెండుసార్లు అవకాశం ఇచ్చినా ప్రజల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు యజమానులు ముందుకు రావడం లేదు. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించినా.. నేటికి ప్రొసీడింగ్ కాపీలు రాకపోవడం కూడా కొత్తగా ఫీజు చెల్లించాలనుకుంటున్న వారిపై ఎఫెక్ట్ కనిపిస్తోంది. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం రూ.1,000తో 69,710 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 12,469 మంది మాత్రమే తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. వీటిపై రూ.22.82 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

**ముగియనున్న 5 శాతం రాయితీ**
సర్కారు ఖజానాకు ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం 2025–26 (ప్రస్తుత) ఆస్తి పన్ను 100 శాతం చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పించింది. ఈ అవకాశం నేటితో ముగియనుంది. జనగామ పట్టణంలో 15,609 అసెస్‌మెంట్లు ఉండగా, రూ.6.74కోట్ల మేర పన్ను వసూలు చేయాలని డిమాండ్ ఉంది. ఇందులో 5 శాతం రాయితీపై ఇప్పటి వరకు 2,082 మంది రూ.75లక్షల మేర చెల్లించి లబ్ధిపొందారు. కాగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు వచ్చే యజమానులకు ప్రొహిబిటెడ్ పరేషాన్ చేస్తోంది. ప్లాట్లు పంచాయితీలో ఫిర్యాదు వెళ్లిన సమయంలో సమీపంలోని అన్నింటినీ ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు. ప్రభుత్వం మరో అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు జనగామ పురపాలికకు వచ్చిన ప్లాట్ల యజమానులు

**మూడు రోజుల నుంచి తిరుగుతున్న..**



క్లబ్ రోడ్డులో 1989లో 250 గజాల ప్లాటు కొనుగోలు చేశా. ఎల్ఆర్ఎస్ కోసం గతంలోనే రూ.1,000 రుసుం చెల్లించా. ప్లాటుకు సంబంధించి మిగతా డబ్బులు చెల్లించి, క్రమబద్ధీకరణ చేసుకుందామంటే ప్రొహిబిటెడ్‌లో ఉందంటున్నారు. అధికారులు సత్వరమే స్పందించాలి.

- చిటుకుల అంజయ్య,21వ వార్డు, జనగామ

## క్లుప్తంగా

### వడదెబ్బతో వ్యక్తి మృతి


రంగ్య (ఫైల్)

బయ్యారం : వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని కస్తూరినగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కస్తూరినగర్ గ్రామానికి చెందిన కేలోత్ రంగ్య (52) ఎండ తీవ్రతకు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

**ఐనవోలులో వృద్ధురాలు..**


సాలమ్మ(ఫైల్)

ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు వడదెబ్బతో మృతిచెందింది. నందనం గ్రామానికి చెందిన యాకర సాలమ్మ (75) కూలీ పనులు, కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం కూరగాయలు అమ్ముకోవడానికి ఇంట్లో నుంచి వెళ్లింది. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై మధ్యాహ్నం ఇంటికి చేరుకుని స్పృహ కోల్పోయి కింద పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత చుట్టు పక్కల వాళ్లు గమనించగా అప్పటికే ఆమె మృతి చెందింది. వడదెబ్బతో మృతిచెందిందని ప్రభుత్వం ఆదుకోవాలని మృతురాలి బంధువులు కోరారు.

### డీఏఓ విజయనిర్మలకు ఆత్మ పీడీగా పదోన్నతి


ఎం.విజయనిర్మల

మహబూబాబాద్ రూరల్: మానుకోట జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల వరంగల్ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు మానుకోట జిల్లా వ్యవసాయ అధికారిగా కొనసాగనున్నారు.

### శ్రీభద్రకాళి అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు షురూ..



హన్మకొండ కల్చరల్ : నగరంలోని శ్రీభద్రకాళి అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాల అంకురార్పణ పూజలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణ, వాస్తుయాగం, గణపతిహోమం, సుదర్శనహోమం, శ్రీభద్రకాళీ పరివస్యా, చండీహోమం, నీరాజన మంత్రపుష్పం జరిపారు. అనంతరం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి హాజరై అమ్మవారి సన్నిధిలో జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం అంకురార్పణ పూజలు నిర్వహించి సర్వతోభద్ర, నవగ్రహ, వాస్తు, యోగినీ, క్షేత్రపాలమండల లేఖనం, ధ్వజాధివాసం చేశారు. ఉదయం శ్రీగణపతి సేవ, సాయంత్రం శ్రీసుబ్రహ్మణ్యసేవ నిర్వహించారు. అంకురార్పణ పూజలకు ఉమ్మడి జిల్లా మున్నూరుకాపు సంఘం ఉభయదాతలుగా వ్యవహరించారు.



# మనకెప్పుడు క్రికెట్ 'వైభవం'..?

**అసౌకర్యాల నడుమ క్రికెట్ శిక్షణ**
- వరంగల్ క్రికెట్ సంఘానికి సొంత మైదానం కరువు
- ప్రాక్టీస్‌కు ప్రైవేట్ పిచ్‌లను ఆశ్రయించాల్సిందే..

వరంగల్ స్పోర్ట్స్ : క్రికెట్ అభిమానుల్లో ఇప్పుడు ఎవరి నోట విన్నా వైభవ్ సూర్యవంశి.. నిన్నటి వరకు ఎవరో తెలియని వైభవ్, తన సత్తా చాటి ఐపీఎల్‌లో కొత్త చరిత్రను సృష్టించాడు. 14 ఏళ్ల కుర్రాడు 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్సులు మొత్తంగా 101 పరుగులు చేసి ప్రపంచ క్రికెట్ దిగ్గజాలను ఆకట్టుకున్నాడు. చిన్న వయస్సులోనే వైభవ్ ఐపీఎల్ సెంచరీ కొట్టడంతో డీఎస్ఏలో శిక్షణ పొందుతున్న పలువురు యువ క్రికెటర్లను 'సాక్షి' పలకరించింది. వైభవ్ ఆట తీరు పై అడుగుతూ, వీళ్లకేం కావాలో అడిగి తెలుసుకునే ప్రయత్నం చేసింది.


హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు


శిక్షణ ఇస్తున్న కోచ్

#### ఇవీ సమస్యలు..

- పట్టుదల, ప్రతిభ, సత్తా ఉన్న వైభవ్‌లు మనవద్దా లేరా..మనకెప్పుడు క్రికెట్ వైభవం అంటూ వరంగల్ క్రికెట్ అభిమానుల్లో చర్చ మొదలైంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధంగా వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఉన్నప్పటికీ ఒక్క వైభవ్‌ను తయారు చేయలేకపోవడం బాధాకరం. ఇన్నేళ్లలో ఒక్కరూ వరంగల్ నుంచి క్రికెట్ వైభవాన్ని ప్రపంచానికి ఎందుకు ఎలిగెత్తి చాటలేదు. అన్నింటికీ ఒకే సమాధానం క్రికెట్‌కు సొంత మైదానమే లేకపోవడం.
- హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్‌లో క్రికెట్ స్టేడియం లేకపోవడం ఇక్కడి క్రికెట్ పెద్దల నిర్లక్ష్యానికి నిదర్శనం. హెచ్‌సీఏ అధ్యక్షుడి హోదాలో అనేక మంది వరంగల్‌కు వచ్చి వెళ్లారు. వచ్చిన ప్రతీసారీ అంతర్జాతీయ స్థాయిలో వరంగల్ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని ప్రకటనలు ఇవ్వడం, అవీ కాలగర్భంలో కలిసిపోవడం పరిపాటిగా మారింది.
- హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిత్యం క్రికెట్‌లో అనేక మంది శిక్షణ పొందుతున్నారు. అయితే డీఎస్ఏ అందించే శిక్షణ కేవలం గల్లీలో ఆడేంత వరకు మాత్రమే సరిపోతుంది. జేఎన్ఎస్‌లో సైతం ఆర్ట్రో టర్ఫ్ పిచ్, లైటింగ్, బౌలింగ్ మిషన్ వంటి అధునాతన పరికరాలు అందుబాటులో లేవు. దీంతో కోచ్ సాధారణ శిక్షణ ఇవ్వాల్సి వస్తోంది.

#### చీకటి పడితే ఇంటికి వెళ్లాల్సిందే



రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నాను. స్కూల్ నుంచి ఇంటికెళ్లి గ్రౌండ్‌కు వచ్చే సరికి సాయంత్రం అవుతుంది. గంట ప్రాక్టీస్ చేయగానే చీకటి పడుతుంది. మరో గంట పాటు ప్రాక్టీస్ చేద్దామనుకుంటే అంతా చీకటే. ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తే ఎక్కువ సమయం ప్రాక్టీస్ చేయొచ్చు. టర్ఫ్ పిచ్, ఫ్లడ్ లైట్స్, బౌలింగ్ మిషన్ లాంటి అధునాతన సౌకర్యాలు కల్పిస్తే వరంగల్ నుంచి కూడా వైభవ్‌లు పుట్టుకొస్తారు.

- ఎండీ అమన్, హనుమకొండ

#### ప్రత్యేక స్టేడియం ఉండాలి



ప్రపంచంతో పోటీపడి ఆడాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదు. సాధనకు సరిపడా వసతులు ఉండాలి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులు ఎందరో ఉన్నారు. క్రికెట్‌కు ప్రత్యేకంగా సొంత స్టేడియమే లేకపోవడం బాధాకరం. రోజూ ప్రాక్టీస్ చేసే గ్రౌండ్‌కు బరిలో దిగే గ్రౌండ్ మరోలా ఉంటే ఆడేందుకు కష్టపడాల్సి వస్తోంది.

- మహ్మద్ అఫ్జల్, క్రికెట్ కోచ్, డీఎస్ఏ

#### ఏడాది నుంచి ప్రాక్టీస్ లేదు



ఇంతకుముందు కాకతీయ మెడికల్ కాలేజీ మైదానంలో శిక్షణ ఇచ్చే వాళ్లం. ఇప్పుడు వారు అనుమతి నిరాకరించడంతో ఏడాది నుంచి క్రీడాకారులకు ప్రాక్టీస్ లేదు. బౌలింగ్ మిషన్, ఆస్ట్రో టర్ఫ్ పిచ్ ఉన్నప్పటికీ సొంత మైదానం లేకపోవడం వల్ల మెరుగైన శిక్షణ ఇవ్వలేక పోతున్నాం. వరంగల్‌లో క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు హెచ్‌సీఏ సిద్ధంగా ఉంది. ప్రభుత్వం స్థలం ఇవ్వకుండా జాప్యం చేస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వాలను అనేక సార్లు వినతి పత్రాలు, ప్రతిపాదనలు పంపించాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం ఉంటే ప్రతిభ గల క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చు.

- చాగంటి శ్రీనివాస్, కార్యదర్శి, వరంగల్ క్రికెట్ సంఘం

#### వైభవ్ ఆటను మరిచిపోలేను



రాజస్తాన్ రాయల్స్, గుజరాత్‌ల మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన వైభవ్ ఆట ఆద్యంతం కట్టిపడేసింది. అంతకుముందు ఆడిన ఆటలో అంతగా ఆడని వైభవ్, ఈ మ్యాచ్‌లో సిక్సులు, ఫోర్లతో ప్రత్యర్థులకు చెమటలు పట్టించాడు. నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. పది పూర్తికాగానే హనుమకొండకు వచ్చి క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. ఇప్పటి వరకు అండర్ -19 నేషనల్స్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ మ్యాచ్‌లో కేయూ టీం కెప్టెన్‌గా ఆడాను. ప్రాక్టీస్‌కు మరింత వసతులు కల్పిస్తే బాగా రాణిస్తాం.

- ఎం.నవ్యనాయక్, డిగ్రీ, కేడీసీ హనుమకొండ

#### సాధారణ గ్రౌండ్‌లో ప్రాక్టీస్..



రెండున్నర ఏళ్లుగా డీఎస్ఏ కోచ్ అఫ్జల్ వద్ద శిక్షణ తీసుకుంటున్న. ప్రతి రోజు ప్రాక్టీస్ చేసేది సాధారణ గ్రౌండ్‌లో.. టోర్నమెంట్లకు వెళ్లినప్పుడు అక్కడ పిచ్ బాగుంటుంది. దీంతో అక్కడ బ్యాటింగ్‌లో పట్టు దొరికే లోపే వికెట్లను కోల్పోవల్సి వస్తోంది. అండర్-17 కేటగిరీలో రెండు స్టేట్ మీట్‌లు ఆడాను.ఒక నేషనల్స్‌కు ప్రాబబుల్స్‌గా ఎంపికయ్యాను.

- డి. శ్రీసహస్రరాజ్, హనుమకొండ

#### అధునాతన వసతులు కల్పించాలి



మూడేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్న.అండర్-14 లో రెండు స్టేట్ మీట్లు ఆడాను. బ్యాట్ పట్టినప్పటి నుంచి నేను ఇక్కడే ఇరుకైన నెట్ ప్రాక్టీస్ చేస్తున్నా. టోర్నమెంట్లు ఉన్నప్పుడు ప్రైవేట్ మైదానాల్లో ఆడుతుంటాము. ఇక్కడ ప్రాక్టీస్ చేసి, మైదానాల్లో ఆడడం ఇబ్బందిగా ఉంటుంది. అధునాతన బౌలింగ్ మిషన్, టర్ఫ్ పిచ్ ఇతర వసతులు అందుబాటులో ఉంటే మా టీంలోనూ ఎందరో వైభవ్‌లు ఉన్నారు.

- విదాత్‌శర్మ, హనుమకొండ

# 'ఇందిరమ్మ' జాబితా క్రాస్ చెక్

**కమిటీలదే ఎంపిక బాధ్యత**
- 600 చదరపు అడుగులు దాటితే.. అనర్హులు
- నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అధికారులే బాధ్యులు



హసన్‌పర్తి : ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల జాబితా సిద్ధమైంది. ఎంపిక చేసిన జాబితాను మళ్లీ క్రాస్ చెక్ చేస్తున్నారు. జాబితాలో ఉన్న లబ్ధిదారులు అర్హులా? కదా? అని నిర్ధారించడానికి మళ్లీ అధికారులు ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. నాలుగు రోజులుగా ప్రత్యేకాధికారులు సర్వేలో నిమగ్నమయ్యారు.

**ఇందిరమ్మ కమిటీలదే బాధ్యత ..**

సాక్షి మీ కోసం

లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఇందిరమ్మ కమిటీలకు అప్పగించారు. ఆయా గ్రామాలు, డివిజన్లలో ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను స్థానిక ఎమ్మెల్యేకు అప్పగించగా, అదే జాబితాను అధికారులకు అందజేశారు. అనర్హులుగా ఉన్నట్లు తేలితే వారి పేర్లను తొలగిస్తున్నట్లు సమాచారం.

**600 ఎస్ఎఫ్‌టీ దాటొద్దు**

సొంత స్థలం ఉండి 400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకున్న వారు పేదవాడు కాదని వారికి పథకం వర్తించదని అధికారులు చెబుతున్నారు.దీంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన పెంబర్తిలో ఓ లబ్ధిదారుడు 600 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీంతో అతడు అనర్హుడని గుర్తించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అనర్హులకు పథకం వర్తింపజేస్తే ఆ బాధ్యత స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓదేనని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది.

**మూడు కేటగిరీలుగా దరఖాస్తులు**

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించిన అధికారులు వాటిని మూడు కేటగిరీలుగా విభజించారు. సొంతంగా స్థలం ఉండి ఇల్లు లేని వారిని ఎల్-1 కేటగిరిలో, స్థలంలో గుడిసె, పూరి గుడిసె, మట్టి ఇళ్లు, రేకుల ఇళ్లున్న వారిని సైతం ఎల్-1 కేటగిరిగా విభజించారు. సొంత స్థలం లేని వారిని ఎల్-2 కేటగిరిలో, సొంత ఇళ్లు ఉండి, ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్-3 కేటగిరిలో పొందుపరిచారు. ఇక్కడ ఎల్-1 కేటగిరిలో ఉన్నవారికే ప్రాధాన్యత కల్పించారు.

# రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

**మే 5నుంచి జూన్ 13వరకు కార్యక్రమాలు**

హన్మకొండ : వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు, మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు నడుం బిగించారు. అందులో భాగంగా మే 5నుంచి జూన్ 13వ తేదీ వరకు ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని చేపట్టబోతోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాల వ్యాప్తంగా 50కి పైగా బృందాలను నియమించారు. ప్రతి బృందంలో విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, కళాశాల విద్యార్థులు, అభ్యుదయ రైతులు ఉంటారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ పరిశోధ సంస్థలు, వ్యవసాయ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలోని శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రభుత్వ అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొంటారు.

ఈ సందర్భంగా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ.. రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు సలహాలతో పాటు వ్యవసాయంలో రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులను తగ్గించుకోవడానికి అవసరమైన సూచనలు, యాంత్రీకరణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు స్వయంగా పాల్గొనడం ద్వారా గ్రామీణ స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను స్వయంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


ఆర్.ఉమారెడ్డి, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్త

# రేపు బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : మే డే సందర్భంగా రేపు (గురువారం) హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, రడం శ్రీనివాస్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 30వ తేదీ సాయంత్రం 4గంటలలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 93915 00826 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

# ఇంటర్ వర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నీకి మహిళా జట్టు


ఎంపికైన మహిళా జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్ : ఏపీలోని నెల్లూరులో గల విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఈనెల 30నుంచి మే 5వ తేదీవరకు జరుగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ ఉమెన్ జట్టు పాల్గొననుందని కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య మంగళవారం తెలిపారు. ఈ జట్టులో ఎం.అనుబిందు (న్యూసైన్స్ డిగ్రీ కాలేజీ హనుమకొండ), టి.స్పందన (మాతృశ్రీ, డిగ్రీ కాలేజీ, భీమారం), ఎ.అనూష (వీసీపీఈ, బొల్లికుంట), ఎస్.సుమిత్రా (కాకతీయ డిగ్రీ కాలేజీ, హనుమకొండ), జి.పూజ, సీహెచ్ రమ, ఆర్.భాగ్యశ్రీ (యూసీపీఈ కేయూ), జె.దుర్గాభవాని, ఎస్.సాయిప్రసన్న (వీసీపీఈ, బొల్లికుంట), ఎ.నందిని, బి.అరవింద (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ, కొత్తగూడెం), పి.సొనాలి (టీజీడబ్ల్యూఆర్‌డీసీ, ఆసిఫాబాద్), పి.నాగలక్ష్మి (ఆర్ట్స్ కాలేజీ, హనుమకొండ), ఎన్.శైలజ (యూసీపీఈ కేయూ, ఖమ్మం), ఎ.అర్చన (వరంగల్ కిట్స్), టి.శ్యామల (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీ హనుమకొండ) ఉన్నారని వెంకయ్య పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్‌గా ఎ.రాజేష్, మేనేజర్‌గా పి.లక్ష్మీపతి వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు.

# యజమాని అంటూ మెసేజ్..

- రూ.1.68 కోట్లు కాజేసిన సైబర్ నేరస్తుడి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ ఫణిందర్

వరంగల్ క్రైం : యజమాని పేరుతో ఫేక్ మెసేజ్ చేసి కోట్లు కాజేసిన సైబర్ నేరస్తుడిని అరెస్టు చేసినట్లు వరంగల్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఏసీపీ సీహెచ్.ఆర్.వి. ఫణీందర్ తెలిపారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, ప్రతాప్‌ఘడ్ జిల్లాకు చెందిన ప్రదీప్ కుమార్.. హనుమకొండలోని ప్రముఖ హచరీస్ సంస్థలో పనిచేస్తున్న గుమాస్తాకు మార్చి 19వ తేదీన ఓ నంబర్ నుంచి ఫోన్ చేసి 'నేను మీ యజమానిని.. ఇది నా కొత్త ఫోన్ నంబర్ అని, ఈ నంబర్ సేవ్ చేసుకొమ్మని' సదరు సంస్థ గుమాస్తాకు వాట్సాప్‌లో మెసేజ్ పంపించాడు. దీంతో తన యజమాని నంబర్ అని భ్రమపడి సంస్థ గుమాస్తా తన ఫోన్‌లో సేవ్ చేసుకున్నాడు. మరుసటి రోజు గుమాస్తా తాను సేవ్ చేసుకున్న నంబర్‌కు ఫోన్ చేయగా నేను మీటింగ్‌లో ఉన్నాను, తర్వాత చేస్తానని సైబర్ నేరగాడు సమాధానం చెప్పాడు. అనంతరం నిందితుడు గుమాస్తాకు ఫోన్ చేయడంతో యజమానే ఫోన్ చేస్తున్నాడని ఫోన్ తీయడంతో ఎక్కడ ఉన్నావని అడిగి తన బ్యాంక్ లావాదేవీలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నాడు. ప్రస్తుతం ఉన్న బ్యాంక్ బ్యాలెన్స్ నుంచి తాను చెప్పిన అకౌంటుకు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయమనడంతో గుమాస్తా నిందితుడు చెప్పిన బ్యాంక్ ఖాతాకు రెండు దఫాలుగా మొత్తం రూ.1.68 కోట్లు బదిలీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మరోమారు నిందితుడు ఫోన్ చేయడంతో నిందితుడి మాటతీరును తప్పుపట్టి గుమాస్తా అనుమానంతో తన సంస్థ యజమానికి సంబంధించిన వ్యక్తిగత నంబర్‌కు ఫోన్ చేశాడు. దీంతో అసలు విషయం బయటకు వచ్చి యజమాని, తమ గుమాస్తా సైబర్ నేరగాడి చేతిలో మోసపోయినట్లుగా గుర్తించి వెంటనే వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ విభాగంలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రస్తుతం పోలీసుల వద్ద ఉన్న టెక్నాలజీతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ యాసిన్, ఎస్సైలు చరణ్, శివ, కానిస్టేబుల్లు శివ, జహార్‌ను ఏసీపీ అభినందించారు.

# మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ : మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని ప్రజా సంఘాల నాయకులు మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శాంతి చర్చల కమిటీ బాధ్యులు సోమ రామ్మూర్తి, గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్, ఆదివాసీ, గిరిజన, దళిత ప్రజా, పౌర సంఘాల బాధ్యులు మాట్లాడారు. ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టి కార్పొరేట్లకు ఖనిజ సంపద అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, గిరిజనులను చంపడాన్ని వారు ఖండించారు. శాంతి చర్చలకు పిలవాలని మావోయిస్టు పార్టీ ప్రతినిధులు అడుగుతుంటే వారిని గౌరవించి పిలువకుండా తుదిముట్టించే దాకా వదలబోమనడం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆదివాసీలను నిర్మూలించే పద్ధతిని మోదీ సర్కారు కొనసాగిస్తోందన్నారు. భారత్ సమ్మిట్‌లో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, ఆదివాసీ, గిరిజన హక్కులపై కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌లు చేస్తే సరిపోదనీ, ఆదివాసీలపై జరుగుతున్న దాడిని ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, బాదావత్ రాజు, రాజారపు భాస్కర్, జిలకర శ్రీనివాస్, బొట్ల భిక్షపతి, నున్న అప్పారావు, పోరిక ఉదయ్ సింగ్ నాయక్, సమ్మయ్య రాథోడ్, కరుణాకర్ నాయక్, అజ్మీరా వెంకట్, నలిగంటి ప్రసాద్, వెంగల్ రెడ్డి, చావా రవి, పాలకుర్తి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- వరంగల్ జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య


వైద్యసిబ్బందితో నాగయ్య

తొర్రూరు : ఉమ్మడి వరంగల్ జిల్లాను మలేరియా రహితంగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని ఉమ్మడి జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.నాగయ్య పేర్కొన్నారు. జాతీయ కీటక జనిత నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. ఫ్రై డే- డ్రై డే కార్యక్రమ తీరుతెన్నులపై ఆయన ఆరా తీశారు. పెద్దవంగర మండలం పోచారంలోని డెంగీవ్యాధితో బాధపడుతున్న వ్యక్తి ఇంటిని సందర్శించి వారితో మాట్లాడారు. అనంతరం నాగయ్య మాట్లాడుతూ మలేరియా కేసులను సకాలంలో గుర్తించి ప్రాణాలు పోకుండా ఉండేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్వలిత, వైద్యులు మీరాజ్, నందన, ఆరోగ్య సిబ్బంది కుసుమ విద్యాసాగర్, వనాకర్‌రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి యువకుడి బలవన్మరణం

- తమ్ముడి మరణం తట్టుకోలేక అన్న ఆత్మహత్యాయత్నం


అనిల్ (ఫైల్)

జనగామ రూరల్ : పురుగుల మందు తాగి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన జనగామ మండలంలోని గోపిరాజుపల్లిలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గోపిరాజుపల్లికి చెందిన పిడుగు అనిల్ (22) వ్యవసాయం చేసుకుంటు కుటుంబ సభ్యులతో జీవిస్తున్నాడు. వ్యవసాయంతో పాటు ఇతర కూలీ పనులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. సోమవారం రాత్రి గ్రామ శివారులో పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్నేహితులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వెంటనే జనగామ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కాగా మృతికి గల పూర్తి విషయాలు తెలియరాలేదు. అయితే విషయం తెలుసుకున్న మృతుడి అన్న పిడుగు రమేశ్ తమ్ముడి మరణం తట్టుకోలేక అదే ఆస్పత్రిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. డాక్టర్లు వెంటనే చికిత్స అందజేయగా ఎలాంటి ప్రమాదం లేకపోవడం ఊపిరి పీల్చుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై, పోలీసులు తెలిపారు.

# అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


రవి కిరణ్ (ఫైల్)

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని జక్కులవారి వీధికి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 24వ తేదీన అదృశ్యం కాగా, మంగళవారం మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. జక్కుల వారి వీధికి చెందిన వాసం రవికిరణ్ కుమార్ (40) మిషన్ భగీరథ పథకంలో పంప్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అతడి ఆరోగ్యం బాగోలేక కొంతకాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 24వ తేదీన భగీరథ నీరు వదిలి పెట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కాగా రవి కిరణ్ కుమార్ సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. రవికిరణ్ కుమార్ తల్లి సాలమ్మ అతడి జాడ వెతికిన కనిపించక పోవడంతో ఈ నెల 25వ తేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం వీఆర్‌కే పురం గ్రామ సమీపంలోని పాలెం వాగు ప్రాజెక్టు కాల్వ సమీపంలో మృతదేహం లభ్యమయ్యిందని పేర్కొన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

IV
సాక్షి ఫ్యామిలీ
వరంగల్
బుధవారం ॥ 30-4-2025

'వంక'లు లేవు వాగులు లేవు... చెప్పడానికి సాకులు లేవు.
వేసవి సెలవులు వచ్చేశాయి.
సోషల్ మీడియా బందీఖానా నుంచి పిల్లలను ఇప్పుడు రిలీజ్ చేయాలి.
పుస్తకాలకు దగ్గరగా తీసుకురావాలి.
విక్రమార్కుడి సింహాసనం ఎక్కిస్తే కథల దర్బారులోకి వారే ప్రవేశిస్తారు.
వేసవి సెలవుల్లో ఉన్న 50 రోజుల్లో
పిల్లలు పుస్తకాలు ఎందుకు చదవాలి, ఏవి చదవాలి?
వేసవి శీర్షిక 'వేసవి కాలమ్'లో మొదటి కథనం.




సెలవులొచ్చాయి

# ఆడించండి... చదివించండి..





**పి**ల్లలకు బడి గంట ఇష్టమే. కాని స్కూల్ మొదలయ్యేప్పుడు కొట్టే గంట కంటే స్కూల్ వదిలేప్పుడు కొట్టే గంట ఎక్కువ ఇష్టం. ఆ గంట వినపడగానే పుస్తకాలు తీసుకుని క్లాస్ నుంచి పరిగెత్తుతారు. కొందరు ప్లేగ్రౌండ్‌కు వెళతారు. కొందరు ఇంటికి చేరి వెంటనే చుట్టుపక్కల ఫ్రెండ్స్‌ను పోగేస్తారు. ఎందుకు? ఇంకెందుకు... ఆటలు ఆడటానికి.

ఇంట్లో నుంచి అమ్మ పిలుస్తున్నా... ఏదైనా తిని వెళ్లమని అరుస్తున్నా పిల్లలు లెక్క చేయరు. ఆడుతుంటారు. ఆడుతూ అరుస్తూ ఉంటారు. నవ్వుతూ ఉంటారు. పేచీ పెడుతూ ఉంటారు. ఓడుతూ ఉంటారు. గెలుస్తూ ఉంటారు. ఇవన్నీ చేస్తూ చెమట చిందిస్తూ ఉంటారు.

**పిల్లలూ చెమటా కవలలు.**

నేడు... పిల్లలకు చెమటే లేదు. ఎందుకు? ఎందుకంటే వాళ్లు ఆడటం లేదు కాబట్టి. ఆడే బదులు ఓ.టి.టి.లో, కంప్యూటర్లో, సోషల్ మీడియానో తమ బాల్యంతో ఆటలాడుకోవడానికి వీలు కల్పిస్తున్నారు కాబట్టి.

**దొంగ... పోలీస్**

'దొంగ పోలీస్' ఆట అందరికీ తెలుసు. ఇవాళ దొంగ పోలీస్ ఆట ఎంతమంది పిల్లలకు తెలుసు? ఎంత సింపుల్ ఆట ఇది! ఐదారు మంది పిల్లలు కలిసి పంటలు వేసి గెలుస్తారు. ఆఖరున మిగిలినవాడు పోలీస్ అయ్యి గోడ వైపు తిరిగి వంద లెక్కబెడతాడు. ఈ లోపు పిల్లలు దాక్కుంటారు. ఆ దాక్కున్న వాళ్లను పోలీస్ కనిపెట్టాలి. కనిపెట్టలేకపోతే పోలీస్ ఓడిపోతాడు. ఈ ఆట ఆషామాషీ ఆటనా? పిల్లల మెదడుకు తర్ఫీదు ఇస్తుంది. ముందుముందు జీవితంలో తారసపడబోయే వారిలో ఎవరు దొంగ.. ఎలాంటి దొంగ... వాడి వ్యవహార శైలి ఎలా ఉంటుంది... ఎవరు ఏ మేరకు తప్పించుకోలరు... అదొక్కటేనా? మన వ్యక్తిత్వంలో దొంగ పనులు ఎలా చోటు చేసుకుంటున్నాయి... వాటిని వెతికి పట్టుకొని జైలుకు పంపితే ఎంత మంచి విద్యార్థులం కాగలం... అసలు దొంగలా దాక్కునే బతుకు ఎంత నీచమైనది.... ఇవన్నీ పైకి చెప్పకనే నేర్పిస్తుంది.

ఇవాళ్టి పిల్లలకు కామిక్ హీరో, యూట్యూబ్ గేమర్ తెలుసుకాని దొంగ పోలీస్ తెలీదు. పైగా పిల్లలు ఆ ఆట ఆడుతూ కనిపిస్తే పెద్దలే నవ్వి, జోకులేసి 'మరీ ఈ ఆటలా' అని ఆపించేలా ఉన్నారు.

**ఆట లేకుంటే ఆందోళన**

పిల్లలు ఆడేందుకు పుట్టారు. ఆడి ఆడి వారు పెద్దవాళ్లవ్వాలి. ఆటకు దూరమయ్యి కాదు. 'పిల్లల చైల్డ్‌హుడ్ యాంగ్జయిటీకి వారు ఆటలకు దూరం కావడమే కారణం' అంటారు జోనాథన్ హైడ్ అనే సోషల్ సైకాలజిస్టు. ఆటకు బదులు టీవీ, కంప్యూటర్, సోషల్ మీడియాకు బానిసైన ఏ పిల్లవాడైనా దృష్టి చెడి, నిద్ర చెడి, కల్మషం నింపే కలకలం రేపే కంటెంట్‌ను చూసి ఆందోళనకు గురవుతాడు. కదలిక లేని మెదలిక లేని కుర్చీలో కూలబడి కేవలం మెదడుకు ఒత్తిడి ఇవ్వడం ద్వారా మెదడుతో పాటు శరీరం కూడా శుష్కమయ్యి మెదడకు తగిన శక్తి ఇవ్వడంలో వెనుకబడుతుంది.

**వివాదాల ఇల్లు**

అయితే తల్లిదండ్రులు చాలా నియమాలు పెట్టాలని చూస్తారు. టీవీ ఆఫ్ చేస్తారు. రౌటర్ కట్ చేస్తారు. ఓటీటీ రెన్యువల్ చేయరు. ఈ తల్లిదండ్రులే కోవిడ్ కాలంలో ఇవన్నీ అలవాటు చేశారు. ఇప్పుడు వద్దంటే పిల్లలు మానుతారా? ఆటలు ఆడి శ్రమ చేయడానికి ఇష్టపడకపోగా కుర్చీలో కూలబడి పొందే వినోదం కోసం తల్లిదండ్రులతో ఘర్షణ పడుతూ ఉంటారు. దాంతో ఇంట్లో అశాంతి నిండిపోతుంది. అందుకే జోనాథన్ హైడ్ ఏమంటారంటే ముందు పిల్లలకు పుస్తకాలు అలవాటు చేయండి. తర్వాత ఆటల్లోకి తీసుకురండి అని.

**కట్టెల మోపు కథ**

చనిపోయే ముందు ఒక తండ్రి తన నలుగురు కొడుకులకు ఒక్కొక్క కట్టె ఇచ్చి విరవమంటాడు. వాళ్లు విరుస్తారు. ఇప్పుడు నలుగురి చేతుల్లో ఉన్న కట్టెలను మోపుగా కట్టి విరవమంటాడు. కొడుకులు విరవలేకపోతారు. 'కలిసి ఉంటే ఇలా బలంగా ఉంటారు' అని చనిపోతాడు తండ్రి. కొడుకులు ఆ ఐకమత్యాన్ని పాటిస్తారు. కథలు ఎన్నో విషయాలు చెబుతాయి. నేర్పుతాయి. సూక్ష్మబుద్ధిని చూపుతాయి. సమస్యలు ఎదురైతే తెనాలి రామలింగడిలా దొంగల చేతే బావిలోని నీళ్లన్నీ చేదించి పాదులు తడుపుకునే తెలివితేటలను ఇస్తాయి. భారతదేశంలో నుంచి ప్రపంచం కథలను తీసుకుంటే మన పిల్లలకు మనం కథలను దూరం చేస్తున్నాం. పిల్లల నిపుణులు ఏమంటారంటే బొమ్మలున్న కథల పుస్తకాలు చిన్న పిల్లలకు కామిక్కు, గ్రాఫిక్ నవలలు టీనేజర్లకు ఇచ్చి వారికి పుస్తకాలు అలవాటు చేయమని. పుస్తకం చదివిన పిల్లలు ఆ కథను తోటి పిల్లలతో పంచుకోవాలనుకుంటారు. నలుగురు పిల్లలూ కథలు చెప్పుకోవడానికి కూడతారు. ఆ తర్వాత? ఆడుకుంటారు. ఇదీ ఆరోగ్యకరమైన బాల్యం అంటే.

**క్లాసులు... స్పెషల్ క్లాసులు...**

ఆటల బదులు మార్కులు, సాటి పిల్లలకు బదులు ట్యూషన్ క్లాసులు చుట్టుముట్టి పిల్లలను ఆందోళనలోకి నెడుతున్నాయి. కాలూ చేయీ కదపని దేహం బుద్ధిని ఎలా కదుపుతుంది? ఫిట్‌గా లేని శరీరం ర్యాంకులు ఎలా తెస్తుంది? ఆటలో పడి లేస్తారు పిల్లలు. అది అలవాటైతే చదువులో పడినా లేవడం తెలుసుకుంటారు. లేదా లేవడానికి కథల్లో చదివిన ఒక ఉదాత్త నాయకుడిని తోడు తెచ్చుకుంటారు. ఆటపాటలు లేకపోవడం వల్లే నేడు పిల్లలు ర్యాంకు రాకపోయినా ఫెయిల్ అయినా చాలా దూరం పోతున్నారు.

సెలవులొచ్చాయి.
ఆడించండి. చదివించండి.

– కె.

బ్యూటిప్స్

**మూ**డు టేబుల్ స్పూన్స్ మేర సగ్గు బియ్యం తీసుకోవాలి. అంతకు ముందే వాటిని ఓ కప్పు నీటిలో ఉడకబెట్టాలి. అయితే.. ఫేస్ మాస్క్ తయారీ కోసం వీటిని ఆ నీటితో పాటు వాడాలి. ఈ మాస్క్ లో అన్నం కూడా కలపాలి. రెండు మూడు టేబుల్ స్పూన్స్ అన్నాన్ని తీసుకోవాలి. ఆ తరవాత ఓ టేబుల్ స్పూన్ శనగపిండి, ఓ టేబుల్ స్పూన్ బంక మట్టి, ఓ టేబుల్ స్పూన్ తేనె అందుబాటులో ఉంచుకోవాలి. చివరగా మూడు నుంచి నాలుగు టేబుల్ స్పూన్స్ రోజ్ వాటర్ నీ తీసుకోవాలి. వీటన్నింటినీ ఓ మిక్సీ జార్ లో వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ లా వేసుకుని ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు లేదా మూడు సార్లు చేస్తూ ఉంటే ముఖం మిలమిలలాడుతుంది.





● పర్యావరణ హిత

# ఈ చిత్రాన్ని మీకు సమర్పిస్తున్న వారు...

నోరు లేని మూగజీవాలు, విలువైన ప్రకృతి గురించి చెప్పడానికి ఎన్నో కథలు ఉన్నాయి. వాటికి చిత్రరూపం ఇవ్వడానికి, మహిళలలోని సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, వారిని డైరెక్టర్లుగా తీర్చిదిద్దడానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' అనే స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది.

**కో**ల్‌కత్తాకు చెందిన అశ్వికాకపూర్ బీబీసి నేచురల్ హిస్టరీ యూనిట్ డైరెక్టర్. పశ్చిమబెంగాల్ అడవుల్లో 'వణ్యప్రాణుల వేట' పేరుతో ఉత్సవాలు చేస్తారు, ఇందులో పిల్లలు కూడా పాల్గొంటారు. దీనిపై ఆమె 'క్యాటపల్ట్స్ టు కెమెరాస్' చిత్రాన్ని తీసింది. ఈ చిత్రం న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ స్ఫూర్తిదాయక చిత్రంగా అవార్డు గెలుచుకుంది.

అశ్వికాలాంటి ఎంతోమంది మహిళా దర్శకుల విజయానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' దారి చూపింది.



'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ద్వారా వణ్యప్రాణుల గురించి వీలైనంత ఎక్కువగా తెలుసుకునే అవకాశం వచ్చింది. ఎప్పుడూ వినని అరుదైన జీవులు గురించి కూడా తెలుసుకున్నాను. వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్‌గా ఇది నాకు ఎంతో ఉపయోగపడుతుంది' అంటుంది అశ్వికాకపూర్.

### పిల్లల జీవితాలను మార్చింది

వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీ, చిత్రాల ద్వారా వేటకు వెళ్లే పిల్లల మనస్తత్వాలను మార్చాం. ఇప్పుడు వారు అడవి జంతువులను 'వేట కోసం' అన్నట్లుగా చూడడం లేదు. సంరక్షించుకోవాల్సిన అందమైన జీవులుగా చూస్తున్నారు. మా చిత్రనిర్మాణ ప్రక్రియ వన్యప్రాణులను కాపాడడమే కాదు పిల్లల జీవితాలను కూడా మార్చింది. తమ చుట్టూ ఉన్న సహజ ప్రపంచంతో కనెక్ట్ కావడానికి వారికి ఇది కొత్త మార్గాన్ని చూపించింది.

– నేహా దీక్షిత్, ఫిల్మ్‌మేకర్

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' సంస్థను సియాటిల్‌కు చెందిన పారిశ్రామికవేత్త, దాత గుర్‌ప్రీత్ సన్నీసింగ్ స్థాపించారు. వణ్యప్రాణులపై విలువైన కథలు వెండితెరపై చెప్పడానికి వీలుగా ఇది మహిళా కథకులకు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్ దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ఫిల్మ్‌మేకర్స్‌తో కలిసి పని చేస్తోంది. ఫండింగ్ నుంచి దర్శకులకు మార్గనిర్దేశం చేయడం వరకు రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఎన్నో చేస్తుంది' అంటుంది రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్ క్రియేటివ్ డైరెక్టర్, ఫిల్మ్‌మేకర్ సమ్రీన్ ఫారూఖీ.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' నిర్మాణ సంస్థ తన వెబ్‌సైట్ ద్వారా సినిమాలను విడుదల చేస్తుంది.

### వారే నిజమై హీరోలు

**భూ**గోళ సంక్షోభం గురించి నిరాశపడడం కంటే కార్యాచరణ అనేది ముఖ్యం. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది సంరక్షకులు, శాస్త్రవేత్తలు, రేంజర్ల రూపంలో ఆశ కనిపిస్తుంది. వారు నిజమైన హీరోలు. ఈ హీరోలు మన భూగోళాన్ని సురక్షితంగా ఉంచడానికి అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. వారి అంకితభావం మన ఆశావాదానికి బలాన్ని ఇస్తుంది. ఆ ఆశావాదాన్ని దశదిశలా వ్యాప్తి చేయడం ఫిల్మ్‌మేకర్‌గా నా బాధ్యత.

– అశ్వికా కపూర్, ఫిల్మ్‌మేకర్

సినిమాలను ప్రమోట్ చేయడానికి టీమ్ విస్తృతంగా మార్కెటింగ్ కూడా చేస్తుంది.

దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఆన్‌లైన్ స్క్రీనింగ్‌లు నిర్వహిస్తారు.



'విస్మరించబడిన కథలను వెలుగులోకి తీసుకురావాలనుకుంటుంది. పెద్దగా ఎవరికీ తెలియని ఆవాసాలు, పర్యావరణ వ్యవస్థలు, జాతులకు ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి తోడు లోకల్ ఫిల్మ్‌మేకర్స్‌పై దృష్టి పెట్టింది. సహజ ప్రపంచం గురించి మాట్లాడడానికి మల్టీ మీడియా విధానాన్ని ఉపయోగిస్తోంది. ఫోటో స్టోరీలు, ఇన్ఫోగ్రాఫిక్స్, వ్యాసాలు, కార్టూన్లు ఇందులో ఉంటాయి. కథలను సంచలనం కోసం చెప్పాలనుకోవడం లేదు. స్పష్టంగా చెప్పాలనుకుంటుంది' అని రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ గురించి చెబుతోంది సమ్రీన్.

లీగల్

## ష్యూరిటీ ఇచ్చేముందే జాగ్రత్త పడాలి

**నా స్నేహితుడు ఒక ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో డబ్బు తీసుకునేటప్పుడు నేను హామీ (ష్యూరిటీ) ఇచ్చాను. ఇప్పుడు అతను పరారీలో ఉన్నాడు. చిట్‌ఫండ్ వారు నాపై కేసు వేశారు. ఆ మొత్తం నేను కట్టవలసిందేనా?**

**– రాహుల్, ఖమ్మం**

ష్యూరిటీ ఇమ్మని మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయలేదు కదా! ష్యూరిటీ ఇచ్చిన తర్వాత మీరు ఎంత మొత్తానికి హామీ ఇచ్చారో అంత మొత్తం మీ వద్ద నుండి వసూలు చేస్తారు. వాయిదా పద్ధతుల్లో చెల్లించవచ్చు. మీ స్నేహితుడికి ఏవైనా ఆస్తులు ఉంటే అవి జప్తు చేయవలసినదిగా కోరవచ్చు. అలాంటివి ఏమైనా ఉన్నాయేమో చూడండి. ష్యూరిటీ ఇచ్చేముందు జాగ్రత్త వహించడం మంచిది. నమ్మకస్తులకి, డబ్బు తిరిగి చెల్లించే స్థితి ఉన్న వారికి మాత్రమే ష్యూరిటీ ఇవ్వడం మంచిది.

**నేను ఒక ప్రైవేటు సంస్థలో చిట్టీ కట్టాను. మొత్తం 50 నెలలు కట్టాలి కానీ నా పరిస్థితులు బాగుండక 15 నెలలు మాత్రమే కట్టాను. చిట్టీ ఎత్తలేదు. నేను కట్టిన డబ్బు నాకు తిరిగి రావాలంటే ఏం చేయాలి?**

**– సుందర్, హైదరాబాద్**

చిట్టీ కట్టడాన్ని మధ్యలోనే ఆపేయడం తరచుగానే చూస్తుంటాం. మంచి సంస్థలలో అయితే లిఖితపూర్వక హామీపత్రాలు (అగ్రిమెంట్) ఉంటాయి కాబట్టి, అందులోని ఒప్పందం ప్రకారం కొంత జరిమానా విధించి మీరు అప్పటివరకు కట్టిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తుంటారు. కొన్ని సంస్థలు అయితే చిట్టీ గడువు పూర్తిగా ముగిశాక లేదా మీ బదులు ఇంకెవరైనా మీ గ్రూపు చిట్టీలో కలిస్తే కొంత కమీషన్ తీసుకొని డబ్బు తిరిగి ఇస్తుంటారు. ఏది ఏమైనా, మీరు కట్టినన్ని డబ్బులు మీకు రావు కానీ పూర్తి నష్టం మాత్రం ఉండదు. మీరు చిట్టీ కట్టిన సంస్థని సంప్రదించి క్యాన్సిలేషన్ అడగండి. వారి నిబంధనల మేరకు వారికి రావలసిన మొత్తాన్ని మినహాయించుకుని మిగిలినది ఇస్తారు.



**- శ్రీకాంత్ చింతల**
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

* జెండర్ ఈక్వాలిటీ

# ప్లంబర్లుగా మహిళా శక్తి!



**లిం**గ సమానత్వం కార్పొరేట్ రంగాల్లో కాదు శ్రామిక శక్తిలో చూపాలి అని నిరూపిస్తోంది జోర్డాన్ మహిళ. జోర్డాన్‌లో వందలాది మహిళలు ప్లంబర్లుగా విధులను నిర్వహిస్తున్నారు. మొదట్లో దీనిని అవమానకరంగా భావిస్తూ వీరి పనులపై గతంలో నిషేధం విధించారు. అక్కడి సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా మహిళలు శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఒక సవాల్‌గా ఉంది. ఇప్పుడు ఆ అనిశ్చితి తొలగి, జోర్డాన్‌లో మహిళా ప్లంబర్లపై ప్రభుత్వం నిషేధాన్ని తొలగించింది. 2006లో మొట్టమొదటి లైసెన్స్ పొందిన మహిళా ప్లంబర్ ఖవ్లా షేక్ ఈ పనిలోకి ఎక్కువ మంది మహిళలు వచ్చేలా ప్రోత్సహిస్తుండగా, 2014లో ఏర్పడిన వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ ఈ రంగంలో లింగసమానత్వం సాధించడానికి కృషి చేస్తోంది. జోర్డాన్ సంప్రదాయ కట్టుబాట్ల కంచెను తొలగించుకుంటూ అక్కడి మహిళ తన ఉనికికోసం చేస్తున్న కృషి ప్రపంచం దృష్టిని ఆకట్టుకునేలా చేస్తోంది.

'స్త్రీ ఉద్యోగం చేయకూడదు, అది కుటుంబానికే అవమానం. అటువంటిది మరీ చోద్యం కాకపోతే పురుషులకు దీటుగా చేసే ఆ పనులేంటి..!?' తహానీ అల్ షాతి, యుస్రా మోహమ్మద్ స్మోర్.. వంటి వాళ్లు ప్లంబర్లుగా శిక్షణ ప్రారంభించినప్పుడు ఇలాంటి ఎన్నో మాటలు తమ సాటి వారి నుంచి వచ్చినవే. జోర్డాన్‌లో సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా జీతంతో కూడిన పనిలో మహిళల నిష్పత్తి ప్రపంచంలోనే అత్యల్పంగా ఉంది. శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఇప్పటికీ చాలామంది మహిళలకు అతిపెద్ద సవాల్.

**సమర్థతే సరైన ఔషధం**

ప్లంబర్లుగా శిక్షణ తీసుకుంటున్న తొలి రోజులను అల్‌షాతి గుర్తుచేసుకుంది. శిక్షణ తీసుకుంటున్న ఇతర మహిళలు వీధిలో నీళ్లు లీక్ అవుతున్న పైపును చూశారు. లీకేజీని ఆపడానికి తమ వద్ద గల ఉపకరణాలను బయటకు తీశారు. దారిన పోతున్న ఒక మహిళ వారిని చూసి 'మీరేంటి ఈ పనులు చేయడమేంటి?' అని తిట్టడం మొదలుపెట్టింది. దాంతో అక్కడ ఇంకొంతమంది పోగయ్యారు. వాళ్లు కూడా అవే మాటలు.. అవేమీ ఈ శిక్షణ తీసుకుంటున్న బృందం పట్టించుకోలేదు. నీళ్ల లీకేజీని ఆపాలనుకున్న పనిని సమర్థంగా పూర్తిచేశారు. నీటినష్టాన్ని నివారించారు. దీంతో అక్కడున్న వారి నోళ్లు మూతపడ్డాయి. తమలో తాము గొణుక్కుంటూ అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇప్పుడు అక్కడ అల్ షాతి, స్మోర్ లాంటి వందలాది మహిళా సర్టిఫైడ్ ప్లంబర్లు ఉన్నారు.

రాజధాని నగరమైన అమ్మాన్‌లోని ఈ మహిళలంతా 'ఈ అసాధారణ కెరీర్ మా జీవితాలనే మార్చిందని, ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యాన్ని అందించిందని, ఇతర మహిళలకు శిక్షణ ఇస్తూ తమ దేశాన్ని పర్యటించే అవకాశాలను కల్పించిందని' ముక్త కంఠంతో అంటున్నారు. 'నా భర్త, పిల్లలు నన్ను చూసి చాలా గర్వపడుతుంటారు. నా పొరుగువారు నన్ను చూసి అసూయపడుతున్నారు' అని స్మోర్ చెబుతుంది.

**భిన్నమైన సేవ**

జోర్డాన్‌లో నీటి కొరత పెద్ద సమస్య. ఇందుకు భౌగోళిక, పర్యావరణ పరమైన కారణాలు మొదటివి కాగా, నీటిని దొంగిలించడం అనేది మరో ముఖ్యమైన కారణం.

అందుకే జోర్డాన్‌లో మహిళల కోసం అనేక ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా నీటి పొదుపు కోసం రకరకాల ఉపకరణాలను బిగించడంలో మహిళలకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. నీటి వనరుల నిర్వహణలో మహిళలను పాల్గొనేలా చేయడం మంచి నిర్ణయమని నీటి, పారిశుధ్య సలహాదారు హింద్ అల్లైఫాత్ పేర్కొన్నారు. ఎందుకంటే నీటి ప్రాముఖ్యత గురించి వారికే ఎక్కువ తెలుసు. ఈ మేరకు వారు యువత, వృద్ధులలో అవగాహనను తీసుకు రాగలరు. ఈ కోణంలో చూసినపుడు వారు తల్లులే కాదు, టీచర్లు కూడా!

**ఆర్థిక భద్రత**

అల్ షాతి, స్మోర్ తో సహా కొంతమంది మహిళా ప్లంబర్లు 2014లో వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ కార్యక్రమంలో చేరారు. కలిసి పనిచేయడం వల్ల భద్రత, ఆర్థిక స్థిరత్వం, అలాగే పెద్ద ప్రాజెక్టులను లీడ్ చేసే అవకాశాలు లభిస్తాయనేది వీరి ఆలోచన. ఇందులోని సభ్యులు తమ చుట్టుపక్కల ఇళ్లకు వెళ్లి ఉచిత సర్వీస్ అందిస్తున్నారు.

మొదటిసారి 2004లో 15 మంది మహిళలతో కలిసి శిక్షణ తీసుకున్నప్పుడు 'సంస్కృతికే అవమానం' అనే కారణంగా ఇతరులెవరూ దానిని ఆమోదించలేదు. కానీ, ''నేడు ఈ పని రాని వారు కూడా సాధారణ మరమ్మతులు చేయడం నేర్చుకుంటే ఇండ్లలో తమ ప్లంబర్ పనిని తామే చేసుకోవచ్చు' అని వివరిస్తూ తోటి మహిళలనూ ప్రోత్సహిస్తున్నారు. ఇలా ప్లంబర్ పనిచేసే ఈ మహిళలంతా చాలా కాలంగా తమ సమాజంలోని నిబంధనలను సవాల్ చేస్తూ తమ ఉనికిని చాటుతున్నారు. లింగ సమానత్వాన్ని కాపాడుకున్నారు.

ఇంటిప్స్

## కిచెన్ నైఫ్ పదును పోయిందా...

**అప్పుడప్పుడు వంటగది చాకులు పదును లేకుండా కూరగాయలు కోయడానికి విసిగిస్తూ ఉంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు చిన్న చిట్కాలున్నాయి.**



- పదును పెట్టే రాయి.. పదును పెట్టే రాయిని ఒక్కసారి కొనేసుకుంటే అది ఎప్పటికీ పనిచేస్తుంది. కత్తులు, చాకులు ఇలా వేటినైనా ఈజీగా పదును పెట్టచ్చు. మనీ సేవ్ చేయడమే కాదు. సమయం కూడా వృథా కాదు.
- నైఫ్ షార్ప్‌నర్.. ఎలక్ట్రిక్, మాన్యువల్ కత్తి షార్ప్‌నర్లు సౌకర్యవంతంగా ఉంటాయి. మరీ ఎక్కువ పదును లేకుండా చూసుకుంటూ పదును పెట్టాలి.
- చాకుల్ని పొడిగా ఉంచాలి.. తేమ తుప్పు పట్టేలా చేస్తుంది. కూరగాయలు కోయడం అయిపోయాకా కత్తుల్ని కాగితం, తువ్వాళ్లలో కట్టి ఆరనీయాలి.
- చాపింగ్ బోర్డ్.. గాజు, గ్రానైట్ లేదా సిరామిక్ ప్లేట్లలో కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను కట్ చేయడం వల్ల చాకులు ఇట్టే పదును పోతాయి. ఈ పదును ఎక్కువ కాలం ఉండాలంటే చెక్క వస్తువు మీదనే కట్ చేసేలా చూడాలి.
- కటింగ్ టెక్నిక్.. చాకు మీద ఒత్తిడి తగ్గించి సరైన కటింగ్ మెథడ్స్ పాటిస్తూ కట్ చేయడం వల్ల పదును తగ్గే అవకాశాలు తక్కువగా ఉంటాయి.